క్లుప్తంగా

పనులు నాణ్యతగా చేపట్టాలి



కొత్తకోటలో డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్

సి.బెళగల్: గ్రామాల్లో అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని గ్రామాలలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. కొత్తకోట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో చేపట్టిన మురుగు కాలువ నిర్మాణ పనులను పరిశీలించి కాంట్రాక్టర్లకు, కూలీలకు సూచనలు చేశారు. అదేవిధంగా ఆయా గ్రామాలలోని పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు నేడు రెండో విడత అభివృద్ధి పనులను పరిశీలించారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి



ఆధార్ సేవలను పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు: మండలంలోని పింఛన్‌దారులు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పరిపాలన అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్ సూచించారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆధార్ ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 74 మంది పింఛన్‌దారులకు బయోమెట్రిక్ అథెంటికేషన్ కొరకు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ క్యాంపు గురువారం కొనసాగుతుందని తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్ర మృతి



సుమతి (ఫైల్)

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్ర అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. ఓర్వకల్లు గ్రామానికి చెందిన ఎల్లమద్ది కామరాజు(మాజీ డీలర్) భార్య ఎల్లమద్ది సుమతి (40) గత 2008 నుంచి హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైఎస్సార్ ఆరోగ్య మిత్రగా సేవలందించారు. ఈ క్రమంలో ఏడాది నుంచి అనారోగ్యానికి గురైంది. దీంతో కర్నూలు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృత్యువాత పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుమతి మృతి పట్ల పలువురు వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు, గ్రామ సర్పంచు నాగేశ్వరమ్మ, శంకర్‌రెడ్డి, గోవింద్ రెడ్డి తదితరులు మృతదేహాన్ని పరామర్శించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతురాలికి కొడుకు, కూతురు సంతానం ఉన్నట్లు తెలిపారు.

రగ్బీ జాతీయ జట్టుకు గురుకులం విద్యార్థి ఎంపిక



క్రీడాకారుడు జ్ఞానేశ్వర్ నాయక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బలరామ్

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయ రగ్బీ జట్టుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ బలరామ్ తెలిపారు. బుధవారం ఆయన వివరాలను వెల్లడిస్తూ, ఈనెల 21న కర్నూలులోని ఆదర్శ విద్యామందిర్‌లో జరిగిన అండర్ -17 రగ్బీ ఎంపిక పోటీల్లో తమ పాఠశాల 10వ తరగతి విద్యార్థి జ్ఞానేశ్వర్‌నాయక్ ఉత్తమ ప్రతిభ కనపరచడంతో జాతీయ జట్టుకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆయన పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ విజేయుడుతో కలిసి విద్యార్థి జ్ఞానేశ్వర్‌నాయక్, పీడీ రాఘవేంద్ర, పీఈటీ ప్రభాకర్‌లను అభినందించారు.

వైభవంగా వనదేవతల ప్రతిష్ఠోత్సవాలు



గడివేములలో వనదేవతల ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రంలోని కొర్రపోలూరు రస్తా కుందూనది ఒడ్డున ఉన్న రాములమ్మ వనంలో బుధవారం వనదేవతల ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా జరిగాయి. శ్రీ రాములమ్మ, లక్ష్మమ్మ, శీతలాదేవి, రామేశ్వర స్వామి విగ్రహాలకు ఉదయం గణపతి పూజ పుణ్యాహవాచనం రుత్విగ్వరణం, నవగ్రహ వాస్తు ప్రధాన దేవత కలశస్థాపన పూజలు నిర్వహించారు. సాయంత్రం మృత్సంగ్రహణం (పుట్టమట్టికి వెళ్లుట) అంకురార్పణ, దీక్షా హోమం, విగ్రహాలకు జలాధివాసం తదితర ప్రత్యేక పూజలు పురోహితుడు ఆదినారాయణశర్మ ఆధ్వర్యంలో జరిగాయి. వివిధ కార్యక్రమాల్లో రామేశ్వరావు, రాఘవేంద్ర, కృష్ణకాంత్, ద్వారం శ్రీనివాసరెడ్డి, రమణ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకే నవరత్నాలు

- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- గార్గేయపురంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే'



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్, ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్

కర్నూలు సిటీ: ఆర్థిక అసమానతలు తొలగించి, పేదరికం లేని సమాజ స్థాపన కోసమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం గార్గేయపురం సచివాలయం-1 నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మలతో కలిసి పాల్గొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ప్రజాధనాన్ని టీడీపీ పాలక పక్షాలు ఏ రకంగా దోచేశారో అందరు చూశారన్నారు. జగనన్న ప్రజా సమస్యలను పాదయాత్ర ద్వారా దగ్గర నుంచి చూసి 2019 ఎన్నికల్లో మ్యానిఫెస్టో తయారు చేసి, ఇచ్చిన హామిలన్నింటినీ పూర్తి స్థాయిలో అమలు చేశారని చెప్పారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పీజీ చదువుకొని డెంటల్ డాక్టర్ అయిన నేను.. నేడు జగనన్న దయ వల్ల ఎమ్మెల్యేగా ఎంపిక అయ్యానన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు సీఎం ఎమ్మెల్యేలను ప్రజల దగ్గరకు గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో పంపిస్తున్నారన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాలు

రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలను పార్టీలకు, కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. గార్గేయపురం సచివాలయం-1 పరిధిలో నవరత్నాల పథకాల ద్వారా రూ.21,72,45,350 ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా లబ్ధి చూకూరిందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ అనురాధ, వైస్ ఎంపీపీ నెహెమియా, సర్పంచ్ సోమేశ్వరమ్మ, ఎంపీటీసీ జ్యోతిలత, పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, సింగిల్ విండో చైర్మన్ శేషిరెడ్డి, యేసేపు, మాజీ వైస్ ఎంపీపీ డి.వాసు, నాయకులు సురేష్, గోవర్ధన్, మద్దిలేటిరెడ్డి, సునీల్, ఉల్చాల సర్పంచ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సాధికారత సీఎం జగన్‌తోనే సాధ్యం

గడివేముల: సాధికారత, సంక్షేమాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పుల్లయ్య అన్నారు. మండల పరిధిలోని కరిమద్దెల గ్రామ సచివాలయంలో బుధవారం ఆంధ్ర ప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్), పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ పరిధిలో డీబీటీ,నాన్ డీబీటీల ద్వారా రూ.27,53,99,130 ప్రభుత్వం నుంచి వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందారన్నారు. సర్పంచ్ సుంకన్న, దాలుస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



కరిమద్దెల గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

వైఎస్సార్‌సీపీతోనే పేదల ఆర్థికాభివృద్ధి

కల్లూరు:పేదల ఆర్థికాభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందని పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య, జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ కేశవరెడ్డి, సర్పంచ్ సువర్ణమ్మ అన్నారు. బుధవారం కొంగనపాడు గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని ఈఓఆర్డీ రవికిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొంగనపాడులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

జగనన్నతోనే పేదల సంక్షేమం



హుసేనాపురంలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- కాల్వ సచివాలయం-2 పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఓర్వకల్లు: రాష్ట్రంలో పేదల ప్రజల సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని, అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కాల్వ గ్రామ సచివాలయం-2 పరిధిలోని హుసేనాపురం జంగాల పేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈఓఆర్డీ సుబ్బరాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూనే, రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాకే పేదలకు ఆర్థిక చేయూత లభించిందన్నారు. నాలుగున్నరేళ్లలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రూ.1.50 లక్షల చొప్పున సహాయం అందినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న భూములను సవరించి అసైన్డ్ కమిటీ ద్వారా పట్టాలు మంజూరు చేస్తామన్నారు. స్థానిక నాయకులు చిన్న వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ నూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంచాలకట్టలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

గడివేముల: మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప బుధవారం తెలిపారు. కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరై గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తారన్నారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తారని చెప్పారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంక్షేమ పథకాలతో ప్రజలందరూ సంతోషం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- 250 రోజులకు చేరిన 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు సిటీ: ఎన్నికల్లో గెలిచిన తరువాత మొదటి ఏడాదిలోనే సంక్షేమ పథకాలను అమలు చేయడంతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని గార్గేయపురంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారంతో కోడుమూరు నియోజకవర్గంలో 250 రోజులకు చేరింది. గార్గేయపురం గ్రామంలో ఏడు రోజుల పాటు చేపట్టిన కార్యక్రమం సైతం ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక సచివాలయం వద్ద స్థానిక నాయకులు ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించారు. ఎమ్మెల్యేతో పాటు, ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు లబ్ధిపొందిన వివరాలతో కూడి బుక్‌లెట్లను అందజేసి వివరించారు. అర్హులైన వారందరికీ పథకాలు అందుతున్నాయా అని ఆరాతీశారు. అనివార్య కారణాల వల్ల ఎవరైన పథకాలను అందుకోలేని వారితో మరోసారి దరఖాస్తు చేయించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

సమస్యలు పరిష్కారానికే గడప గడపకు..

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు సీఎం ఎమ్మెల్యేలను ప్రజల దగ్గరకు గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో పంపిస్తున్నారని, నియోజవర్గంలో 250 రోజులు ఈ కార్యక్రమం పూర్తి చేశామన్నారు. సి.బెళగల్ మండలంలోని పోలకల్లు, రంగాపురం, కోడుమూరు మండలంలోని లద్దగిరి, కర్నూలు మండలంలోని రేమట సగం గ్రామం మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. నియోజకవర్గంలోని సుమారు 87 వేల కుటుంబాలలో ఓ పది వేల గృహాలు మినహా ప్రతి గృహాన్ని సందర్శించానన్నారు. గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో కొన్ని సమస్యలను మా దృష్టికి తెచ్చారని, వీలైనంత తొందరగానే వాటిని పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే అంగన్‌వాడీ సెంటర్‌ను, జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి పిల్లలకు పెట్టే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గూడూరు జెడ్పీటీసీ మౌలాలి, గ్రామ నాయకులు శేఖర్, శీను, అనిల్, మూలింటి రత్న స్వామి, సల్మాన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకటగిరిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కోడుమూరు రూరల్ : మండలంలోని వెంకటగిరి గ్రామ సచివాలయంలో గురువారం మధ్యాహ్నం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ మంజుల బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ విచ్చేస్తున్నారని, సచివాలయ సిబ్బంది, వలంటరీలు, ప్రజలు తప్పక పాల్గొనాలని సూచించారు.

పింఛన్‌దారులకు బయోమెట్రిక్ అప్డేషన్

గూడూరు: ప్రతి నెల వైఎస్సార్ పింఛన్ కానుక సామాజిక భద్రత పింఛన్ తీసుకుంటున్న కొంత మందికి బయోమెట్రిక్ సమస్య వల్ల నగదు అందడంలేదు. ఇలాంటి వారు 25 మందిని గుర్తించి బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి పిలిపించి బయోమెట్రిక్ అప్డేషన్ చేయించినట్లు ఎంపీడీఓ రాముడు తెలిపారు. అర్బన్‌లో 14, రూరల్‌లో 11 మందిని గుర్తించి బయోమెట్రిక్ ఫింగర్ ప్రింట్స్ వేయించామన్నారు.

మత్స్య సంఘం ప్రెసిడెంట్‌గా చెంచులన్న

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు మత్స్య సహకార సంఘం ప్రెసిడెంట్‌గా గ్రామానికి చెందిన నంద్యాల చెంచులన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఎన్నికల అధికారి ఆత్మకూరు ఎఫ్‌డీఓ భరత్‌లాల్‌నాయక్ ఆధ్వర్యంలో మత్స్యకారులతో సమావేశం ఏర్పాటు చేయగా గతంలో పని చేసిన నంద్యాల చెంచులన్ననే సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌తో పాటు మరో ఎనిమిది మంది సభ్యులతో కూడిన పాలక వర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఎఫ్‌డీఓ పామన్న, ఎన్‌టీఎఫ్‌ఏ శివ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

కర్నూలు(హాస్పిటల్): పరిసరాల పరిశుభ్రతలోనే ఆరోగ్యం దాగుందని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. బుధవారం ఆయన స్థానిక షరీఫ్‌నగర్‌లోని యూపీహెచ్‌సీని సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. రిపోర్టులు, రికార్డులు తనిఖీ చేసి అన్ని ప్రోగ్రామ్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. చికిత్స కోసం వచ్చిన రోగులకు పరిసరాల పరిశుభ్రత గురించి వివరించాలన్నారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా వ్యాధులు ప్రబలకుండా చుట్టుపక్కల పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ వారితో కలిసి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని, క్లోరినేషన్ చేయించాలని, చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు ఎత్తించాలని ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: నగరంలోని ప్రభుత్వ అత్యున్నత విద్యా అధ్యయన సంస్థ (ఐఏఎస్ఈ-ప్రభుత్వ బీఈడీ కాలేజీ)లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఆర్ ఆదినారాయణ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, సోషల్ సైన్సెస్, గణితం, సైకాలజీ సబ్జెక్టులు బోధించేందుకు ఎంఎడ్‌తో పాటు, సంబంధిత సబ్జెక్టులలో పీజీ 55 శాతానికిపైగా మార్కులతో పూర్తి చేసి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రతి ఇంటికీ అయోధ్య అక్షింతలు

పాణ్యం: అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలు ప్రతి ఇంటికీ పంపిణీ చేయనున్నట్లు విశ్వహిందూ పరిషత్ సభ్యులు తెలిపారు. బుధవారం పాణ్యం బస్టాండ్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో నంద్యాల నుంచి వచ్చిన అయోధ్య అక్షింతల పంపిణీకి సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం శ్రీరామ ట్రస్ట్ నుంచి అక్షింతలు వచ్చాయన్నారు. ఆంజినేయ స్వామి ఆలయం నుంచి గ్రామంలోని శ్రీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయం వరకు ర్యాలీగా వెళ్లి అమ్మవారి శాలలో ఉంచారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి ఆయా గ్రామాల్లోని దేవాలయాలకు పంపిస్తామన్నారు. అక్కడ ప్రతి రోజు పూజలు చేసి జనవరి 1వ తేదీన గ్రామ పరిధిలోని ప్రతి ఇంటికీ అక్షింతలు పంపిస్తామన్నారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు నాగరాజు, శంకరయ్య, భద్రప్ప, శ్రీనివాసులు, రవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన విశ్వ హిందూ పరిషత్ సభ్యులు

ద్వాదశి వేడుకలను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు

కోడుమూరు రూరల్ : హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని వర్కూరు శ్రీరామాలయం, కల్లూరు మండలంలోని పర్ల శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయాల్లో ఈనెల 24న నిర్వహించే మంగళ కైశిక ద్వాదశి వేడుకలను జయప్రదం చేయాలని ధర్మ ప్రచార మండలి సభ్యులు ఎద్దుల మహేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వర్కూరు శ్రీరామాలయం ఆవరణలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్తీక మాసోత్సవముల పోస్టర్‌ను విడుదల చేశారు. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ధార్మిక కార్యక్రమాలను సమాజంలోని అట్టడుగు వర్గాల వారికి దగ్గర చేసేందుకు ధర్మ ప్రచార మండలి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్య నిర్వాహకులు డా.మల్లు వెంకటరెడ్డి, సమస్త దేవాలయ కమిటీ సభ్యులు రాజశేఖర్, గంగాధర్, రామక్రిష్ణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పొరపాట్లను సరిచేసేందుకు చర్యలు

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో కె.మధుసూదనరావు

కర్నూలు(సెంట్రల్): ముసాయిదా ఓటరు జాబితాలోని పొరపాట్లను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్వో కె.మధుసూధనరావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు స్పష్టం చేశారు. బుధవారం ఆయన తన చాంబరులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణ అంశంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే ఆధారాలతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఓటరు జాబితా సవరణపై బీఎల్ఓలతోపాటు ఇంటింటా సర్వేలో పాల్గొనాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని, చనిపోయినవారి ఓట్లను పంచనామా చేసి తొలగిస్తామన్నారు. . కాగా, రాజకీయపార్టీల ప్రతినిధులు అడిగిన సమాచారాన్ని వారికి అందజేయాలని, ప్రత్యేక ఓటరు అవగాహన కార్యక్రమాన్ని డిసెంబర్ 2,3తేదీల్లో నిర్వహించనున్న నేపథ్యంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. కర్నూలుకు సమీపంలోని తెలంగాణ జిల్లాల్లో వారికి కర్నూలు జిల్లాలో ఓటు అక్కడ..ఇక్కడ ఉంటే తొలగిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 27న ఓటరు జాబితా పర్యవేక్షకులు మురళీధర్‌రెడ్డి ఎన్నికల ఏర్పాట్లపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం కానున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నుంచి రాష్ట్ర న్యాయ విభాగం కార్యదర్శి పుల్లారెడ్డి, టీడీపీ తరపున ఎల్‌వీ ప్రసాదు, ఆమ్‌ఆద్మీ నుంచి మహ్మద్ అక్బర్, బీజేపీ నుంచి పీటీ సాయి ప్రసాదు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన డీఆర్వో కె.మధుసూదన్‌రావు

కారుణ్య నియామకం



నియామక పత్రం అందజేస్తున్న మేయర్ బీవై రామయ్య

కల్లూరు: నగర పాలక సంస్థ నందు ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తూ వ్యక్తి మృతి చెందడంతో అతని భార్యకు కారుణ్య నియామకం కింద అదే ఉద్యోగం కేటాయించారు. దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని బుధవారం నగర మేయర్ బీవై రామయ్య క్యాంపు కార్యాలయంలో అందజేశారు. నగర పాలక సంస్థలో మలెపోగు ఈశ్వరయ్య పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ 2019 సెప్టెంబర్ 15న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య మల్లెపోగు లీలావతికి ప్రభుత్వం అదే ఉద్యోగ అవకాశాన్ని కల్పించింది. నగర పాలక అధికారి ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించి నివేదిక ఇవ్వండి

- పాణ్యం నియోజకవర్గ సెక్టోరియల్ ఆఫీసర్లకు జేసీ ఆదేశం



జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి డిసెంబర్ 30 తేదీలోపు ప్రతిపోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి భద్రతరమైన చర్యలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై నివేదిక ఇవ్వాలని ఆ నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ నారపురెడ్డి సెక్టోరియల్ ఆఫీసర్లను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆమె కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఏఈఆర్ఓలు, సెక్టోరియల్, పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పోలింగ్ స్టేషన్లను పరిశీలించే సమయంలో పోలింగ్ స్టేషన్‌కు 2 కిలోమీటర్ల దూరంలోనే ఓటర్లు ఉండి ఓటు వేయడానికి అనువుగా పరిస్థితులు ఉన్నాయో లేవో గమనించాలన్నారు. వికలాంగుల కోసం ర్యాంపు సౌకర్యం ఉందో లేదో తెలుసుకోవాలన్నారు. డిసెంబర్ 30 లోపు పోలింగ్ స్టేషన్లను ఏఈఆర్‌ఓలు, సెక్టోరియల్ ఆఫీసర్లు, పోలీసుల సంయుక్తంగా మూడుసార్లు పరిశీలించి తుది నివేదికను తనకు సమర్పించి అందులో సమస్యాత్మక కేంద్రాలు ఉంటే వివరాలు తెలపాలన్నారు.

మిగిలిపోయిన నూతన ఓటర్లను నమోదు చేయించండి

పాణ్యం నియోజకవర్గంలో మిగిలిపోయిన నూతన ఓటర్ల వివరాలను నమోదు చేయించేందుకు సహకారం అందించాలని జేసీ నారపురెడ్డి మౌర్య రాజకీయ పార్టీలను కోరారు. బుధవారం సాయంత్రం ఆమె తన కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమై ముసాయిదా ఓటరు జాబితాపై సమీక్షించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పోలింగ్ స్టేషన్లను పరిశీలించాలని, ముసాయిదా జాబితాలో ఓటర్ల తొలగింపు, చేర్పులకు సహకారం అందించాలన్నారు. గడివేముల మండలం కరిమద్దెల, కల్లూరు మండలం చెన్నమ్మ సర్కిల్‌లో ఉన్న పోలింగ్ స్టేషన్లను దారుల ఇబ్బంది దృష్ట్యా మరో ప్రాంతానికి తరలించాలని రాజకీయపార్టీల ప్రతినిధులు కోరడంతో చర్యలు తీసుకుంటామని జేసీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సుధాకర్, అనుమంతరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సురేష్, యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వీక్షిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ వెంకటరమణ

పాణ్యం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్రపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓ వెంకటరమణ ఆధ్వర్యంలో సచివాలయాల ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25వ తేదీ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 25వ తేదీన కొణిదేడు, కౌలురు గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహిస్తారన్నారు. హెల్త్ డిపాట్‌మెంట్‌తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. ఈ వైద్య శిబిరంలో ప్రజలకు చికిత్స చేసి, హెల్త్ కార్డులు అందించాలన్నారు. ఈ కార్డుల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు. ఇప్పటికే ఆయా సచివాలయాలకు కార్డులు వచ్చాయన్నారు. 26న బలపనూరు, భూపనపాడు, 27న పాణ్యం తమ్మరాజుపల్లె గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా ఫ్యామిలీ డాక్టర్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ కాంతారావునాయక్, డాక్టర్ సునీత, అభిషేక్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులగణన పకడ్బందీగా చేపట్టాలి

పాణ్యం: కులగణనను అధికారులు పకడ్బందీగా చేపట్టాలని ఏఎస్ఓ మహబూబ్‌బాష సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో కులగణనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఆయా సచివాలయ పరిధిలో కులగణన చేపట్టాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సహకారంతో సర్వే చేయాలన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి సర్వే చేపట్టి వచ్చే నెల 4వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజు సర్వే వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి పూర్తి వివరాలు కుల గణాంకాలు చేపట్టాలన్నారు. ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదన్నారు. అనంతరం కుల గణన ఎలా చేయాలనే అంశాలను క్లుప్తంగా వివరించారు. ఏఓ నరసింహారెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

నిమోనియా నివారణకు ఉచితంగా వ్యాక్సిన్

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులకు నిమోనియా వ్యాధి సోకకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఖరీదైన వ్యాక్సిన్ అందజేస్తోందని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా కో ఆర్డినేటర్ హేమలత చెప్పారు. బుధవారం ఆమె స్థానిక ఎర్రబురుజు యూపీహెచ్‌సీని తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిమోనియా సోకితే శ్వాస తీసుకోవడానికి కష్టంగా ఉంటుందన్నారు. జబ్బు ఉన్న వారు తుమ్మినట్లయితే గాలి ద్వారా బ్యాక్టీరియా వేరొకరికి అంటుకునే ప్రమాదం ఉందని తెలిపారు. వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న ఐదేళ్లలోపు పిల్లలు, 65 సంవత్సరాలు దాటిన వారికి జబ్బు సోకే అవకాశం ఉందన్నారు. ఈ జబ్బు సోకితే దగ్గు, జ్వరం, ఛాతి నొప్పి, దగ్గితే గళ్ల పడటం, చర్మం నీలి రంగులోకి మారడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. రోగులు దగ్గినప్పుడు చేతి రుమాలు అడ్డు పెట్టుకోవాలని సూచించారు. నిమోనియా రాకుండా ఉండేందుకు పుట్టిన బిడకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలని తెలిపారు. వ్యాధినిరోధక టీకాలు వేయించాలని, తరచూ చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని చెప్పారు.బరువు తక్కువ పిల్లలను వైద్యుల సూచన మేరకు స్నానం చేయించాలని, శిశువులకు చలిగాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టనిస్టు ఖలీల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.